క్లుప్తంగా

చిట్యాల వాసికి డాక్టరేట్


దశరథ

చిట్యాల: పట్టణానికి చెందిన ఉండ్రాతి దశరథ భౌతిక శాస్త్రంలో డాక్టరేట్‌కు ఎంపికైనట్లు ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రొఫెసర్ జే.లక్ష్మణ్‌నాయక్ పర్యవేక్షణలో భౌతిక శాస్త్రం విభాగంలో 'ఇన్వెస్టిగేషన్ ఆన్ రేర్ ఎర్త్ మెటల్ ఐకాన్ సబ్‌స్ట్యూషన్ ఎఫెక్ట్స్ ఆన్ ద స్ట్రక్చరల్ ఆప్టికల్ ఎలక్ట్రోల్ మాగ్నెటిక్, ఫొటో క్యాటలిటిక్ యాక్టివిటీ ప్రాపర్టీస్ ఆఫ్ జింక్-మెగ్నిషియం స్పినల్ ఫెర్‌పెట్స్' అనే అంశంపై చేసిన పరిశోధనలకుగాను ఉస్మానియా యూనివర్సిటీ తనకు పీహెచ్‌డీ అందజేసిందని దశరథ తెలిపారు. ఆయన ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలోని మెర్తాడ్ డిగ్రీ కాలేజీలో భౌతిక శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. చిట్యాల పట్టణానికి చెందిన యాదమ్మ-ఎల్లయ్య దంపతుల పెద్ద కుమారుడు దశరథ డాక్టరేట్ పొందడంపై ఆయన స్నేహితులు అనంత నరేష్, నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చండూరు : మండలంలోని బంగారిగడ్డ జిల్లా పరిషత్ పాఠశాలలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: మండలంలోని పెద్దాపురం ఆదర్శ పాఠశాలలో 6,7,8,9 తరగతులు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లో ఖాళీ సీట్లు ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపాల్ జి.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 4న పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు బీఎస్పీ సమావేశం

కట్టంగూర్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న బీఎస్పీ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఎస్పీ జోనల్ కోఆర్డినేటర్ కత్తుల కాన్షీరాం శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ, బీఎస్పీ సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ అతార్ సింగ్ హాజరవుతారని తెలిపారు.

చెరువు భూమి సర్వే


చెరువు భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని చెరువుకు ఇరువైపులా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు. చెరువుకు ఇరువైపులా ఉన్న భూమిని రెవెన్యూ శాఖ అధికారులు చేపడుతున్న సర్వే పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో రూ.25 కోట్ల నిధులతో నార్కట్‌పల్లి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా నిర్మించేందుకు సర్వే చేస్తున్నట్లు వివరించారు. చెరువు కట్ట వెడల్పు, ఇరువైపులా రోడ్లు, ఫ్లడ్ లైట్లు, బతుకమ్మ ఘాట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ పిచ్చయ్య, మండల ఆర్ఐ తరుణ్, సర్వేయర్ శ్రీనివాస్, ఏఈఈ రమా, నాగరాజు తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

మునుగోడు: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మునుగోడు-చండూరు రోడ్డు వెడల్పులో భాగంగా చేపడుతున్న పనుల్లో రోడ్డుకు ఇరువైపులా గుంతలు తవ్వి పూడ్చకపోవడంతో అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి తవ్విన గుంతలను పూడ్చించాలని కోరారు.

యువతిపై అత్యాచారం..?

నల్లగొండ: యువతికి మత్తు మందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడినట్లు సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొడుతోంది. దేవరకొండ రోడ్డులోని ఒక ఆస్పత్రికి చెందిన డాక్టర్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మత్తు దిగిన తర్వాత ఆ యువతి బస్టాండ్‌కు వెళ్లి బస్‌కోసం ఎదురు చూస్తుండగా స్పృహ తప్పి పడిపోయినట్లు తెలిసింది. 108 వాహనంలో ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ఈ కేసు విషయంలో మాజీ కౌన్సిలర్, ఆర్‌ఎంపీలు మధ్యవర్తిగా ఉండి రాజీ కుదిర్చి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు లేకుండా చూసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. ఈ విషయమై టూటౌన్ ఎస్ఐ సైదులును వివరణ కోరగా.. తమకు ఎలాంటి సమాచారం లేదని, ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. కాగా 108 సిబ్బందిని అడుగగా తాము అలాంటి వారిని ఎవరినీ ఆస్పత్రికి తీసుకెళ్లలేదని తెలిపారు.

బెట్టింగ్‌కు అడ్డాగా టీ పాయింట్స్

- నగలు, సెల్‌ఫోన్‌లు తాకట్టు పెట్టి మరీ ఆడుతున్న యువకులు
- ప్రత్యేక స్థలం కేటాయిస్తున్న నిర్వాహకులు
- కరువైన ప్రత్యేక నిఘా
- ఆవేదన చెందుతున్న తల్లిదండ్రులు



నార్కట్‌పల్లి : యువత ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌కు అలవాటుపడి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడి మోసపోయి అప్పులపాలై ప్రాణాలు పోగొట్టుకుంటున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలంలో ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు అలవాటుపడి నష్టపోయి గతంలో చాలామంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. మరికొందరు అప్పులపాలయ్యారు. పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టి కౌన్సిలింగ్ ఇచ్చినా యువకుల తీరు మారడం లేదు.

24 గంటలూ టీ పాయింట్ల వద్దనే..

నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని నల్లగొండ బైపాస్‌లో రోడ్డులో విచ్చలవిడిగా వెలిసిన టీ పాయింట్‌లు యువకులకు అడ్డాగా మారాయి. ఆయా టీ పాయింట్‌లు 24 గంటలు కొనసాగుతున్నాయి. యువకులు ఎప్పుడు చూసినా టీ పాయింట్‌లలో ఉండడంతో ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. స్థానిక యువకులు కొన్ని టీ పాయింట్‌లను అడ్డాగా మార్చుకుని ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారని సమాచారం. కొందరు టీ పాయింట్ నిర్వాహకులు యువకులకు టీ పాయింట్‌లోనే ప్రత్యేక స్థలం ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌గేమ్స్ ఆడిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. యువకులు డబ్బులు లేకపోతే వారి వద్ద ఉన్న బంగారు నగలు, సెల్‌ఫోన్‌లు తాకట్టు పెట్టి ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నట్లు సమాచారం. నార్కట్‌పల్లిలో కొందరు వ్యాపారులు.. యువకుల వద్ద ఉన్న వస్తువులను తాకట్టు పెట్టుకుని అప్పులు ఇస్తున్నట్లు తెలిసింది.

ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రులు

స్థానిక వ్యాపారస్తులు, ఉద్యోగుల పిల్లలు ఎక్కువగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుండడంతో వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. యువకులు గేమ్ ఆడుతూ డబ్బులు పోగొట్టుకుని వారి వద్ద ఉన్న వస్తువులను తాకట్టు పెట్టి వారి తల్లిదండ్రులకు అబద్ధాలు చెబుతున్నారు. విషయం తెలిసినా కూడా తల్లిదండ్రులు గమనిస్తూ ఏం చేయలేకపోతున్నట్లు తెలుస్తోంది

నిఘా ఏర్పాటు చేస్తాం



టీ పాయింట్‌లలో నిరంతరం ఉండే యువకులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. టీ పాయింట్‌లో యువకులు ఎక్కువ సమయం కేటాయించకుండా నిర్వాహకులు చూసుకోవాలి. గేమ్ ఆడుతున్నట్లు సమాచారం ఉంటే తక్షణమే పోలీసులకు తెలియజేయాలి, టీ పాయింట్‌లో ప్రత్యేక స్థలం (తడకలు) ఏర్పాటు చేయకూడదు. ప్రతి టీ పాయింట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

– క్రాంతికుమార్, ఎస్ఐ నార్కట్‌పల్లి

తల్లిపాలు అమృతంతో సమానం


మర్రిగూడ : బాలింతతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ యశోద


నార్కట్‌పల్లి : పల్లెపహాడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


కట్టంగూర్ : ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదారాణి


నకిరేకల్ : ఓగోడులో ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారి అంజుమ్

నకిరేకల్ : తల్లిపాలు అమృతంతో సమానమని నకిరేకల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి అస్రా అంజుమ్ అన్నారు. శనివారం నకిరేకల్ మండలం ఓగోడు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు. ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు పరిధిలోని 250 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు భవాని, సునీత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుష్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కట్టంగూర్ : పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నకిరేకల్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదారాణి అన్నారు. శనివారం కట్టంగూర్ మండల కేంద్రంలోని అంబటివాగు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీఓ స్వరూపారాణి, ఉపాధ్యాయులు వెంకటరమణ, మీనాక్షి, ఏఎన్‌ఎం వరలక్ష్మి, ఆశా వర్కర్ సంతోష, అంగన్‌వాడీ టీచర్లు కె.సైదమ్మ, భిక్షమమ్మ పాల్గొన్నారు.

మర్రిగూడ : తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద అన్నారు. శనివారం మర్రిగూడ మండలంలోని తమ్మడపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలతోనే శిశువుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు అందించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనూష, ఏఎన్‌ఎంలు లక్ష్మీదేవి, ఫైమీనా, అంగన్‌వాడి టీచర్ సాలమ్మ, కలమ్మ పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

నార్కట్‌పల్లి : మండలంలోని నక్కలపల్లి, పల్లెపహాడ్, చిన్ననారాయణపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు, ఆయా గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు అంజలి, సరిత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలు, శిశువుల తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు విజయ, సుధా, అంగన్‌వాడీ టీచర్‌లు హేమలత, హైమా, సౌజన్య, జ్యోతి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

నాంపల్లి: పెట్రోల్ బంక్ యజమానులు లూజ్ పెట్రోలు అమ్మవద్దని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. శనివారం ఆయన నాంపల్లిలో బీపీసీఎల్ పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని పెట్రోల్ బంకులు డీజిల్, పెట్రోల్‌ను ట్రాక్టర్‌లో తీసుకొచ్చిన డ్రమ్ముల్లో పోసి పంపిస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. డ్రమ్ముల్లో పెట్రోల్, డీజిల్‌ను తీసుకెళ్లి అధిక ధరకు అమ్ముకునే అవకాశం ఉందన్నారు. ఇంధన కల్తీకి పెట్రోల్ బంక్ యజమానులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. బాటిళ్లలో కూడా పెట్రోల్ విక్రయించ వద్దని సూచించారు.

నిరాహార దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి(నల్లగొండ): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టనున్న నిరవధిక నిరాహార దీక్షను విజయవంతం చేయాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ రాంకోటి ప్రజాపతి, రాచమల్ల బాలకృష్ణ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని రామగిరిలో గల ప్రెస్‌క్లబ్ వారు నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లులు పార్లమెంట్‌కు, అసెంబ్లీకి పంపి 9వ షెడ్యూల్లో చేర్చిన ఘనత కవితకే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత కుట్రలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆపాలని చూస్తోందన్నారు. ఈ సమావేశంలో వెలుగు శంకర్, రాములు, దోటి గణేశ్, పగిళ్ల భాస్కర్, శ్రీనివాసచారి, నరేష్, నగేష్, సంధ్యారాణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ స్నేహం..

స్నేహానికి పేదవాడు, ధనికుడు అనే తేడా లేదు. ఇద్దరి భావాలు ఒక్కటైతే చాలు.. కష్టాల్లో సుఖాల్లో అండగా ఉంటూ జీవితాంతం తోడుంటూ వెంట నిలిచే వాడే నిజమైన స్నేహితుడు. అలాంటి స్నేహానికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 3వ తేదీన స్నేహితుల దినోత్సవం జరుపుకుంటారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా కొన్ని ప్రత్యేక కథనాలు మీకోసం..

స్నేహానికి స్ఫూర్తిగా..


రాపోలు ఉపేందర్, తండు శ్రీనివాస్‌గౌడ్

నకిరేకల్ : త్యాగం చేసే స్నేహితులను పొందడం చాలా కష్టం. అలాంటి స్నేహితులు దొరికినవారు అదృష్టవంతులు. అలాంటి స్నేహితులే నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన తండు శ్రీనివాస్‌గౌడ్, రాపోలు ఉపేందర్. చిన్ననాటి నుంచి వారు కలిసిమెలిసి ఉంటూ స్నేహానికి మారుపేరుగా నిలుస్తున్నారు. చందుపట్ల గ్రామంలోని హైస్కూల్‌లో బాల్యం నుంచి కలిసి చదువుకున్నారు. నేటివరకు వారి స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. ఒకరు పోలీస్ వృత్తిలో.. మరొకరు సొంతంగా టీవీ మెకానిక్‌గా పని చేస్తున్నారు. ఎంత బిజీగా ఉన్నా ప్రతి సంవత్సరం స్నేహితుల దినోత్సవం రోజు ఇద్దరు కలుసుకుని ఒకరి బాగోగులు మరొకరు తెలుసుకుంటారు. ఇద్దరిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తోడ్పాటు అందించుకుంటూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ఏ ఆపద వచ్చినా ఒకరికొకరు తోడు


స్నేహితులు రవిప్రకాష్, విజయకృష్ణ

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని సీకే ఆస్పత్రి అధినేత ఆర్థోపెడిక్ డాక్టర్ పల్లెబోయిన రవిప్రకాష్, కోఆపరేటివ్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న సీనియర్ ఇన్‌స్పెక్టర్ వంగూరు విజయకృష్ణ ప్రాణస్నేహితులు. నల్లగొండ పట్టణంలోని సరస్వతి విద్యా మందిర్‌లో 8వ తరగతి నుంచి హైస్కూల్ వరకు, అనంతరం ఇంటర్ వరకు కలిసి చదివారు. రవిప్రకాష్ వైద్య విద్య, విజయకృష్ణ డిగ్రీ చదివారు. 23 సంవత్సరాలుగా ప్రాణ స్నేహితులుగా ఉంటూ ఎవరికి ఏ ఆపద వచ్చినా ఒకరికొకరు ఆదుకుంటారు. రవిప్రకాష్ తన మిత్రుడిగా లభించడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నానని విజయకృష్ణ పేర్కొనడం వారి స్నేహానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

స్నేహానికి అడ్డురాని కులమత భేదాలు


సాయినాథ్‌శర్మ, ఖదీర్

మర్రిగూడ : స్నేహానికి కులమత భేదాలు ఉండవని నిరూపించుకుంటున్నారు మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన సాయినాథ్‌శర్మ, ఖదీర్. చిన్నప్పటి నుంచి ఒకే వీధిలో పెరిగి 25 ఏళ్లుగా ప్రాణ స్నేహితులుగా ఉంటూ ఒకరికొకరు ఆపద సమయంలో నేనున్నానంటూ తోడ్పాటు అందించుకుంటున్నారు. బాల్య దశలో ప్రారంభమైన వీరి స్నేహం ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. ఎవరింట్లో పండుగలు, శుభకార్యాలు జరిగినా ఒకరికొకరు ఆ ఇంట్లో కుటుంబ సభ్యులుగా కలిసిపోతూ గౌరవం ఇచ్చుకుంటున్నారు. సంతోషమైనా, బాధ అయినా ఒకరికొకరు పంచుకుంటున్నారు. చిన్ననాటి స్నేహం చితిమంట వరకు కొనసాగుతుందని విశ్వసిస్తున్నామని ఇద్దరు స్నేహితులు చెప్పుకొస్తున్నారు.

సేవల్లో మిత్రులుగా మారి..


కర్నాటి నరేష్, బ్రహ్మదేవర నరేష్

నకిరేకల్ : పట్టణానికి చెందిన బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్ సేవ చేయాలనే తపనలోనే మిత్రులుగా మారారు. మొదట ట్యూషన్ పాయింట్ పెడదామని సంకల్పించి ఉచితంగా స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారు. బ్రహ్మదేవర నరేష్ శాలిగౌరారం మండలం తిరుమలరాయినిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్నారు. కర్నాటి నరేష్ సంగారెడ్డి జిల్లాలో ఎబీఐఎస్ ప్రైవేటు లిమిటెడ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. వీరు తమ ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే పేద ప్రజలకు సేవ చేస్తున్నారు. మరో ఎనిమిది మంది మిత్రులతో కలిసి ఐదేళ్ల క్రితం వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఆ గ్రూప్ నేడు 278 మందికి చేరింది. గ్రూప్‌లో ఉన్న సభ్యులంతా ప్రతి నెలా రూ.200 జమ చేస్తూ వచ్చిన డబ్బులతో ఆపదలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి సహాయం చేస్తుస్తున్నారు. ఐదేళ్లలో రూ.20 లక్షలకు పైగా ఆర్థిక సహాయం చేశారు.

గీత వృత్తిని ప్రోత్సహించేందుకు కృషి


నార్కట్‌పల్లి : మొక్కలు నాటుతున్న అధికారులు


నకిరేకల్ : నోములలో ఈత, ఖర్జూర మొక్కలు నాటుతున్న సీఐ మల్లయ్య

నకిరేకల్ : కల్లు గీత వృత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నకిరేకల్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య అన్నారు. నకిరేకల్ మండలం నోముల గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఈత, ఖర్జూర మొక్కలను స్థానిక గీత కార్మికులతో కలిసి నాటారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కల్లు గీత వృత్తి పరిరక్షణ కోసమే ప్రభుత్వం ఈత, ఖర్జూర మొక్కలను నాటేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈసందర్భంగా స్థానిక గౌడ సంఘం అధ్యక్షుడు గుండగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ కల్లు గీత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. సంఘం అధ్యక్షుడు గుండగోని జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ రమణయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకన్న, రవి, గౌడ సంఘం నాయకులు రాచకొండ పాపులు, కొప్పు వెంకన్న, రాచకొండ హుస్సేన్, భూపతి నర్సింహ, బాదిని యాదయ్య, యల్మకంటి జానయ్య, పిచ్చయ్య, బాదిని సత్తయ్య, లింగయ్య, రాచకొండ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

నార్కట్‌పల్లి : నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు కల్లుగీత సంఘం సభ్యులు కృషి చేయాలని నల్లగొండ ఎక్సైజ్ సీఐ ప్రసాద్ కోరారు. మండలంలోని చిప్పలపల్లి గ్రామంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఖర్జూర, ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నల్లగొండ ఎక్సైజ్ సీఐ ప్రసాద్ మాట్లాడుతూ ఆసిఫ్‌నహర్ రాచరాల్వ కట్టకు మొక్కలు నాటడం వల్ల కల్లుగీత కార్మికులకు ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలవర్ధన్, కానిస్టేబుల్ రామస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవి, కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు వాసు, ఉపాధ్యక్షులు బత్తిని రమేష్, పనసం ధనుంజయ, మత్తిని రాంబాబు, రామనరసయ్య, సత్తయ్య, పాపయ్య శంకరయ్య, గీత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

నల్లగొండ టౌన్: కార్మిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండలో జరిగిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలేదన్నారు కార్మికుల సమస్యలు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి ఆగస్టు 3 నుంచి 28 వరకు కార్మిక వాడల్లో కార్మిక పని ప్రదేశాల్లో సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. చిన్నపాక లక్ష్మీనారాయణ, డబ్బికారి మల్లేష్, ఎండీ సలీం, అవుత సైదయ్య, ప్రమీల, దండంపల్లి సత్తయ్య, నల్ల వెంకటయ్య, మల్లు గౌతంరెడ్డి, ఏర్పుల యాదయ్య, కానుగు లింగస్వామి, నగేష్, వెంకటేశ్వర్లు, గణేశ్ పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన ఐద్వా జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు నెలకు రూ.2500 చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి పథకంతోపాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో పోలెబోయిన వరలక్ష్మి, కొండ అనురాధ, జిట్టా సరోజ, ఎండీ సుల్తానా, దామెర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల మహోత్సవం


బోనాలు తీసుకెళ్తున్న ఛాత్రోపాధ్యాయులు

నల్లగొండ: శ్రావణ మాసం సందర్భంగా శనివారం నల్లగొండ పట్టణం మిర్యాలగూడ రోడ్డులోని డైట్ ప్రాంగణంలో బోనాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఛాత్రోపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో బోనాలు తయారు చేశారు. పోతరాజుల విన్యాసాలు డప్పుచప్పుళ్లతో డైట్ ప్రాంగణంలోని బీఈడీ కళాశాల నుంచి బీటీఎస్ వరకు బోనాలు తీశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ బీఈడీ కరిక్యులం మూడో సెమిస్టర్‌లో ఆర్ట్ అండ్ డ్రామా సబ్జెక్టులో భాగంగా సంస్కృతి సంప్రదాయాలను నేటితరం విద్యార్థులకు తెలియజేసేందుకు బోనాల కార్యక్రమం చేశామన్నారు. బోనాల మహోత్సవం నిర్వహించిన ఛాత్రోపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులను కళాశాల పూర్తి అదనపు బాధ్యతల ప్రిన్సిపాల్, డీఈఓ బొల్లారం భిక్షపతి అభినందించారు. కళాశాల పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అధ్యాపకుడు పేర్ల జితేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల పరిపాలన అధికారి సి. రాఘవేందర్, అధ్యాపకులు సీహెచ్.వెంకటరామిరెడ్డి, బొడ్డుపల్లి రామకృష్ణ, సుభాషిని, ఫాతిమా, రఫీ, శ్రీధర్‌రెడ్డి, సాదియా పరిహీన్, దేవేంద్ర, అనిల్ కుమార్, సైదులు, నరేష్, మహమ్మద్ సమీ, కె.క్రాంతికుమార్ రెడ్డి, కే శశికళ, డి. రేణుక, కే.మల్లికార్జున్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి


విద్యార్థి బాలాజీకి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న దాతలు

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని చిట్యాల జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం గోగికార్ మాధవి అన్నారు. చిట్యాల జెడ్పీహెచ్ఎస్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శనివారం పాఠశాల ఆవరణలో నగదు ప్రోత్సాహకాలను అందజేసి మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణతో చదవాలని సూచించారు. మొదటి బహుమతి యిమ్మడి బాలాజీకి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి ఫాతిమాకు రూ.10 వేలను చిట్యాల పట్టణానికి చెందిన కొరివి వెంకటేశ్వర్లు తన తల్లిదండ్రులు బుచ్చయ్య-సుశీల జ్ఞాపకార్థం అందజేశారు. కార్యక్రమంలో కొరివి శ్రీకాంత్, బూరుగు కృష్ణయ్య, యిమ్మడి వెంకటేశ్వర్లు, బుద్ధ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకయ్య ఆశయాల సాధనకు కృషి చేయాలి


స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సత్యం, రత్నాకర్‌రావు

చండూరు : చండూరు రైతు సేవా సంఘం మాజీ వైస్ చైర్మన్ బరిగల వెంకయ్య ఆశయాల సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చండూరు మండలంలోని కొండాపురంలో శనివారం సీపీఐ సీనియర్ నాయకుడు బరిగల వెంకయ్య స్తూపాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గడ్డం నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రత్నాకర్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నలపరాజు రామలింగయ్య, జిల్లా సమితి సభ్యుడు తిప్పర్తి రాములు, మండల కార్యదర్శి నలపరాజు సతీష్, సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేశ్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్


ఆస్పత్రిలోని పరికరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్

మర్రిగూడ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం మర్రిగూడ మండలంలోని దామెరభీమనపల్లి ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో గల వట్టిపల్లి గ్రామాన్ని డీఎంహెచ్‌ఓ సందర్శించారు. అనంతరం మర్రిగూడ అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులు, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు అందించే ఆహారాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో టీకా తీసుకుంటున్నవారితో, పిల్లల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. తదుపరి మర్రిగూడ పీహెచ్‌సీ, సీహెచ్‌సీ కేంద్రాలను సందర్శించి అక్కడి వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు అవసరమైన మందులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం డయాలసిస్ కేంద్రాన్ని, రోగుల వార్డులను పరిశీలించారు. ఎన్‌టీఈపీ కార్యక్రమం, వంద రోజుల టీబీ ముక్త్ అభియాన్ పురోగతిని సమీక్షించారు. పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న జ్వర సర్వే వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కేస రవి, సూపరింటెండెంట్ శంకర్‌నాయక్, వైద్యులు శాలిని, దీపక్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ తనిఖీ

నల్లగొండ టౌన్: నల్లగొండలోని వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ నాగరాజు, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ట్రస్టు అధికారి డాక్టర్ నరేష్ తనిఖీ చేశారు. సెంటర్‌లో రిజిస్టర్లు, ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు, ఫార్మసీ స్టాక్, ఉన్న మందుల వివరాలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సెంటర్‌లో ఫార్మసీ స్టాక్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, స్టాక్ అయిపోయిన వెంటనే అవసరమైన మందుల సమాచారం తెలిపాలని సూచించారు.